క్లుప్తంగా

రెండో రోజు పింఛన్ల పంపిణీ

కంచికచర్ల: మండలంలో ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లను లబ్ధిదారులకు రెండో రోజు మంగళవారం గ్రామ సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. మండలంలోని 16 గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మొత్తం 10,438 మంది పింఛనర్లు ఉన్నారు. రెండు రోజుల పాటు గ్రామ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేశారని ఎంపీడీఓ ఎ.దీప్తి తెలిపారు.

వీరులపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రెండో రోజు కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో శివపార్వతి పేర్కొన్నారు.

రోడ్డు మధ్యలో జాగ్రత్తండి..



పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు వెళ్లే రోడ్డులో చెరువు అలుగుల వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి అత్యంత ప్రమాదకరంగా మారింది. వర్షం కురిసినప్పుడు గుంతలో నీరు చేరి కనిపించక పలువురు వాహనచోదకులు కింద పడి గాయాలపాలవుతున్నారు. తక్షణం సంబంధిత అధికారులు పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడిలోని గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గత నెల 30వ తేదీన ప్రారంభమైన బ్రహోత్సవాల్లో స్వామివార్లకు మూడు రోజుల పాటు విశేష పూజలు, హోమాలు జరిపారు. మంగళవారం చక్రస్నానం, పూర్ణాహుతితో పాటు భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. స్వామివారిని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పెద్దలు, అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు.

ఆర్థికసాయం అందజేత

పుట్రేల (విస్సన్నపేట): తమతో కలిసి చదువుకున్న మిత్రుడి వైద్యం కోసం పలువురు స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పుట్రేల జెడ్పీ హైస్కూల్‌లో 1997–98లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న తమ స్నేహితుడు బట్టగాని వెంకటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు రూ. రూ.1,05,000 ఆర్థిక సాయాన్ని వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

రేపు మాసశివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన మాస శివరాత్రి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి విశేషంగా అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు మాస శివరాత్రి పూజల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం వేడుకలు ఘనంగా జరిగాయి. వేదపండితులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ మాట్లాడుతూ విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రతి విద్యార్థికీ సరస్వతీదేవి ఆశీస్సులు లభించాలని తాము సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాల జీఎం శివారెడ్డి, ఏజీఎం కేశవాజు, ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ విద్యార్థులకు పలక, బలపాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల్లో డెర్మటైటిస్

- ఆందోళన చెందుతున్న ప్రజలు
- ప్రమాదం అంటున్న వైద్యులు



తిరుమలగిరి గ్రామంలోని ఓ వీధిలో డెర్మటైటిస్ వ్యాధి సోకిన కుక్క

జగ్గయ్యపేట: వీధి కుక్కల్లో డెర్మటైటిస్ వ్యాధి కనపడుతోంది. ఇలాంటి కుక్కలతో ప్రమాదమే. చర్మ వ్యాధితో బాధపడే కుక్కలను మనం చాలా చోట్ల చూస్తూనే ఉంటాంగానీ.. పెద్దగా పట్టించుకోం. వీటితో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాంటి కుక్కల కాటుకు గురైతే ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లవచ్చని అంటున్నారు. ఈ వ్యాధి సోకిన కుక్కలకు చర్మంపై వెంట్రుకలు ఊడిపోతాయి. చర్మమంతా పొక్కులు వచ్చి చూడటానికే భయంగొలిపేలా కనిపిస్తుంది. చర్మం మందంగా తయారవుతుంది. ఇది అంటువ్యాధి కూడా. డెర్మటైటిస్ సోకిన కుక్కలు మనుషులకు తగిలినా, పశువులకు తగిలినా చర్మవ్యాధి వ్యాపిస్తుంది.

రేబిస్ సోకే ప్రమాదం

మనుషులకు కూడా చర్మంపై ఉన్న వెంట్రుకలు రాలిపోయి మచ్చలు ఏర్పడి చర్మం మందంగా మారుతుంది. పశువులకు సోకితే వాటి చర్మంపై కూడా మచ్చలు ఏర్పడతాయి. ఒకవేళ ఆ కుక్కలు కరిస్తే రేబిస్ కూడా సోకే ప్రమాదం ఉందని పశువైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి సోకిన జంతువుల్లో చొంగ కార్చడం, డొక్కలు లోపలికి నొక్కుకున్నట్లు ఉండటం, మేత తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి సోకిన ఏడు రోజుల్లో ఆ పశువు మరణిస్తుంది. మనుషులకు కూడా దాదాపు ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. రేబిస్ సోకిన పశువులు, కుక్కల చొంగ చేతికి తగిలితే చర్మ గ్రంథుల ద్వారా ఈ వ్యాధి సోకవచ్చు.

గ్రామాల్లో కానరాని చర్యలు..

ఇళ్లలో పెంచుకునే కుక్కలకు వ్యాక్సినేషన్ చేస్తారు. కాబట్టి వ్యాధి వచ్చే అవకాశం ఉండదు. కానీ వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయకపోవడంతో వాటికి ఈ వ్యాధి సోకుతుంది. మున్సిపాలిటీల్లో కుక్కలకు గర్భనిరోధక ఆపరేషన్లు చేస్తున్నారు. కానీ గ్రామాల్లో మాత్రం అటువంటి చర్యలేవీ కానరావడం లేదు. దీంతో గ్రామాల్లో కుక్క కాటుకు గురవుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. దాదాపు ప్రతి రోజూ పలువురు ఆయా పీహెచ్‌సీలకు వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకుంటూనే ఉన్నారు. మరోపక్క జగ్గయ్యపేట పరిసర గ్రామాల్లో చర్మవ్యాధులతో బాధపడుతున్న కుక్కల సంఖ్య కూడా అధికంగానే ఉంది. దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిఇలా ఉండగా బూచవరం ప్రభుత్వాస్పత్రిలో వారంరోజులుగా పదిహేను మందికి కుక్కకాటు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి అనిల్ 'సాక్షి'కి తెలిపారు.

చర్యలు తీసుకోవాలి



చర్మవ్యాధులు సోకిన కుక్కలు గ్రామాల్లో అధికంగా ఉంటున్నాయి. అవి చాలా వికృతంగా ఉంటున్నాయి. గ్రామాల్లో తిరుగుతుండటంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధి సోకిన కుక్కలను గ్రామాల నుంచి తరలించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మధు, చిల్లకల్లు

జాగ్రత్తగా ఉండాలి



డెర్మటైటిస్ వ్యాధి (కేనాన్ మెంజు) సోకిన కుక్కలతో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ వ్యాధి వీధి కుక్కలకు పరాన్న జీవుల వల్ల వస్తుంది. వీటికి వెంట్రుకలు రాలిపోయి వికృతంగా ఉంటాయి. కొన్ని కుక్కలు తిండి తినక, చొంగ కార్చుతూ ఉంటాయి. అటువంటి కుక్కలకు రేబిస్ ఉండే అవకాశం ఉంది. వీటిపై ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆ కుక్కలను తగిలితే ఆ వ్యాధి మనుషులకు కూడా సోకుతుంది. పశువులకు తగిలితే వాటికీ వ్యాధి వస్తుంది.

–శ్రీను నాయక్, పశువైద్యాధికారి, మంగొల్లు

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు



కంచికచర్ల మండలం గండేపల్లిలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంక్



పిల్లర్ బయటకు వచ్చిన ఇనుప చువ్వలు

నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్

గండేపల్లి(కంచికచర్ల): నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందోనని సమీపంలో నివసించే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గండేపల్లిలో 1984–85 సంవత్సరంలో రక్షిత మంచినీటి పథకం కింద ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. ఆ ట్యాంకు నేడు శిథిలావస్థకు చేరింది. ఆ ట్యాంకు సమీపంలో అంగన్‌వాడీ ప్రీ స్కూల్ ఉంది. ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన పిల్లర్ల ఇనుప చువ్వలు బయటకు కనపడుతున్నాయి. శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు తాగునీటిని ట్యాంకులోకి సరఫరా చేయడం లేదు. అంతేకాకుండా ఆ ట్యాంకు చుట్టూ దట్టంగా ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో ముళ్ల పొదల్లో విష పురుగులు సంచరిస్తున్నాయి. ఈ ట్యాంకును తొలగించి కొత్తగా మరో ఓవర్ హెడ్ ట్యాంకును ప్రభుత్వం మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'పోలంపల్లి' మరమ్మతులకు నిధులు ఇవ్వండి

ఎమ్మెల్యే తాతయ్య



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండలంలోని పోలంపల్లి డ్యామ్ మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కోరారు. మంగళవారం మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే తాతయ్య తెలిపారు. మునేరుపై నిర్మించిన డ్యామ్‌కు తాత్కాలిక మరమ్మతులను చేపట్టడానికి నిధులు మంజూరు చేసి ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

నందిగామ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య అన్నారు. బీజేపీ పిలుపు నేపథ్యంలో మొక్కలు నాటండి.. అమ్మకు ఇవ్వండి... కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక బీజేపీ నాయకుల ఆధ్వర్యాన పట్టణంలోని రామలింగేశ్వరనగర్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలే ప్రధాన కారణమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నేతలు బండారు కేదార్నాథ్ శర్మ, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కామేశ్వరరావు, సత్యనారాయణ గుప్తా, కృష్ణ, లక్ష్మణ్, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చెల్లించడం ఉద్యోగుల బాధ్యత

డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఆదాయ పన్ను చెల్లించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. ఆదాయ పన్ను శాఖ, విజయవాడ రైల్వే డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే ఆడిటోరియంలో ఆదాయ పన్నుపై ఉద్యోగులు, పెన్షనర్లకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్‌ఎం మాట్లాడుతూ చాలామంది ఆదాయ పన్ను దాఖలు చేయడంలో ఇతర వ్యక్తులపై ఆధారపడుతున్నారన్నారు. కొద్దిపాటి అవగాహన కలిగి ఉంటే ఇది ఏమాత్రం కష్టతరం కాదన్నారు. ఆదాయ పన్ను నిబంధనలను చదివి వాటిని అర్థం చేసుకుంటే పన్నులను సులభంగా సొంతంగానే ఫైలింగ్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పన్నులు ఫైలింగ్ చేసే క్రమంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. పన్నుల ఎగవేతకు దారితీసే ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ఎస్.అభినయ మాట్లాడుతూ దేశ ఆదాయంలో ఆదాయ పన్నుల సేకరణ కీలకమైనప్పటికీ సరైన అవగాహనతో సులభ పద్ధతిలో పన్నులు చెల్లించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదాయ పన్ను నిబంధనలు, పరిజ్ఞానం, పన్ను చట్టాలు, పన్ను తగ్గింపులు, మినహాయింపులు, తప్పుడు క్లెయిమ్స్ తదితర విషయాలపై పూర్తి అవగాహన కల్పించినట్లు చెప్పారు. అనంతరం ఆదాయ పన్ను శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆదాయ పన్ను దాఖలు, పన్ను ప్రయోజనాలు, తగ్గింపులు, రిఫండ్ స్కామ్‌లు, రెడ్ ఫ్లాగ్ తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.శ్రీనివాస్, సీనియర్ డీఎఫ్‌ఎం ఈ.శివరామకృష్ణ, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, సీనియర్ డీఎంఓ రవికుమార్, ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్‌లు డి.విజయ్ బాబు, ఆర్.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనా రంగాల్లో మహిళల పాత్ర పెరగాలి



మాట్లాడుతున్న ఆచార్య ఉపాసనా బోరా సింహా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పరిశోధనా రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని నాగాలాండ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య ఉపాసనా బోరా సింహా అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎస్టీఈఎం పరిశోధనల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే వ్యూహాలు' అంశంపై సదస్సును మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆచార్య ఉపాసనా బోరా సింహా మాట్లాడుతూ వివిధ రంగాల్లో పరిశోధనలు చేసేందుకు ముందుకు వస్తున్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంటుందన్నారు. ప్రధానంగా విద్యారంగంలో మహిళల సంఖ్య పెరిగినా ఆ మేర పరిశోధనల్లో కనపడటం లేదన్నారు. ఇది సరైనది కాదని అభిప్రాయపడ్డారు. మహిళలు పరిశోధనల్లో పాల్గొనేందుకు, రాణించేందుకు ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాలు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా సామాజిక చైతన్యానికి మానవ వికాసానికి సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథ్స్, ఇంజినీరింగ్ విభాగాల్లో మరిన్ని ఆవిష్కరణలు రావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడు సమాజానికి మరింత మేలు జరుగుతుందన్నారు. పరిశోధనా రంగాల్లో ఉన్న అవకాశాలను మహిళలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఆ దిశగా అవగాహనను పెంచుకోవాలని సూచించారు. ఆయా రంగాల్లో ఉన్న ఉపాధి అంశాలను సైతం పరిశీలించాలని కోరారు. కార్యక్రమాన్ని రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.కృష్ణవేణి నిర్వహించగా పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

ఎస్‌ఎఫ్‌ఐ నేతలు



బంద్ కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నందిగామ: నీట్ పేపర్ లీకేజీ నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ)ఆధ్వర్యంలో జూలై 4వ తేదీన తలపెట్టిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ అన్నారు. బంద్‌కు సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని కేవీఆర్ కళాశాల ఆవరణలో మంగళవారం సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీనాయక్ మాట్లాడుతూ ఆ రోజున ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉన్న అన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బందుకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నీట్ నిర్వహించే ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఫేక్ కాజు, ప్రయోధర్, వెంకటేష్ పాల్గొన్నారు.

10న దేశ వ్యాప్తంగా డిమాండ్స్ డే



కరపత్రాలు విడుదల చేస్తున్న సుధాకర్, కార్మికులు

మైలవరం: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మిక చట్టాలను రక్షించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 10న సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా డిమాండ్స్ డే నిర్వహించనున్నట్లు సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ తెలిపారు. మైలవరంలోని సీఐటీయూ కార్యాలయంలో డిమాండ్స్ డే కరపత్రాలను ముఠా కార్మికులతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లలో 44 లేబర్ చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. వీటితో కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని చెప్పారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేసే పరిస్థితి లేదని, ముఠా, ఆటో, వివిధ రంగాలలో ఉన్న అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు పట్టించుకోకుండా వెట్టి చాకిరీ చేయించుకునే పరిస్థితిలోకి చట్టాలను మారుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న కార్మికులంతా ముక్తకంఠంతో ఈ నెల 10న డిమాండ్స్ డే సందర్భంగా ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి మారేశ్వరరావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పి. సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ విజయవాడ నగర శాఖ ఆధ్వర్యంలో మూకల అప్పారావు స్మారక ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పదో తరగతిలో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబరచిన 21 మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా బోధన చేసిన 62 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు, 37 మంది ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి సుబ్బారావు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగానికి మూకల అప్పారావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు, కోశాధికారి జే శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు, నగర అధ్యక్షుడు గణపతి రావు, బీవీ సోమసుందరరావు, వీటీఆర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి ఐఓసీలో ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్



ట్యాంకర్లను ఫోమ్ వాటర్‌తో తడుపుతున్న అగ్నిమాపక దళ సిబ్బంది

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్‌ను అధికారులు, సిబ్బంది మంగళవారం నిర్వహించారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎంవీ శివకుమార్‌రెడ్డి నేతృత్వంలో ఐఓసీఎల్ పోల్ టెర్మినల్, గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ, గ్రౌండ్ స్టోరేజీలో నీటిని తొలగించే సమయంలో ఎదురయ్యే ప్రమాదాలపై వివిధ రకాల విన్యాసాలు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే సైరన్ మోగించడం, అగ్నిమాపకదళ వాహనాలు చేరుకుని మంటలను అదుపు చేయడం, గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి వైద్యశాలకు తరలించడం వంటి విన్యాసాలను రెస్క్యూ ఆపరేషన్ టీమ్ కళ్లకు కట్టినట్లు నిర్వహించారు. మాక్‌డ్రిల్ విజయవంతంగా పూర్తిచేసిన ఉద్యోగులను డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎంవీ శివకుమార్‌రెడ్డి అభినందించారు.

మోడల్ డ్రైవింగ్ స్కూల్‌ను సందర్శించండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను కోరిన లారీ యజమానుల సంఘం



కలెక్టర్ సృజనను మర్యాద పూర్వకంగా కలిసిన లారీ యజమానుల సంఘ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తేలప్రోలు సమీపంలోని అంపాపురంలో 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వసతులతో అసోసియేషన్ ఆధ్వర్యంలో 2005లో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్దదైన మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించాల్సిందిగా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగమోతు రాజా, ఉపాధ్యక్షుడు కాజ వెంకట సత్య చలపతిరావు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ



వెల్వడం(మైలవరం): శ్రీమద్ భగవద్గీత కంఠస్థ పోటీల్లో మైలవరం మండలం వెల్వడం గ్రామస్తులు ఏడుగురు బంగారు పతకాలు సాధించారు. ఇటీవల బెంగళూరు గణపతి సచ్చిదానందం స్వామీజీ ఆశ్రమం వారితో శ్రీమద్ భగవద్గీత కంఠస్థ పోటీల కార్యక్రమం నిర్వహించారని వెల్వడం సీతారామచంద్రస్వామి దేవాలయం ధర్మకర్త వెల్వడపు సచ్చిదానందం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ధర్మకర్త వెల్వడపు సచ్చిదానందం పర్యవేక్షణలో బంగారు పతకాలు అందుకున్న చేగు లీలారాధిక, చనమోలు రత్నకుమారి, చేగు అరుణకుమారి, కల్లూరి భాగ్యలక్ష్మి, శీలం కళావతి, జూలూరు హారిక, గుడివాడ మౌనికలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుద్ధిరాజు లీలావతి, చంద్రశేఖర భాను దంపతులు, కొణసాని ప్రభాకరరావు, కొల్లి వరప్రసాద్, పరికల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులను అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్యం ప్రదర్శిస్తున్న ప్రణతి బృందం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన ప్రణతి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ప్రణతి శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని ఆరుబయటకు విచ్చేసిన భక్తులు చల్లటి గాలులలో చక్కటి నృత్య ప్రదర్శనను వీక్షించి ముగ్ధులయ్యారు.